# పెళ్లికళ వచ్చేసింది

-పోట్లూరు సుబ్రహ్మణ్యం

అప్పుడు సమయం రాత్రి ఎనిమిది గంటలు. ఎనభై ఏళ్ల నాగేంద్రదాసు గారు రాజసింహాసనం లాంటి తన పూర్వీకుల కుర్చీలో విచార వదనంతో కూర్చొని ఉన్నారు. ఆయనకు అటు ముగ్గురు, ఇటు ముగ్గురు వృద్ధులైన అతని ఆరుగురు భార్యలూ చిన్న చిన్న ఆసనాల్లో కూర్చొని ఉన్నారు. ఆయనకు ఎదురుగా ఆయన పదిహేను మంది కొడుకులు, పదిహేను మంది కోడళ్లతో, ఆయన ఎనిమిది కూతుళ్లు, ఎనిమిది మంది అల్లుళ్లతో కుర్చీల్లో కూర్చొని ఉన్నారు. వాళ్ల వెనుక వరుసల్లో వాళ్ల సంతానమయిన ముప్పయి మంది కొడుకులు, వాళ్ల వాళ్ల భార్యలతో కూర్చుంటే ఇరవై మంది కూతుళ్లు, వాళ్ల వాళ్ల భర్తలతో కూర్చుని ఉన్నారు. దాసుగారు తన భార్యలతో కూర్చున్న చోటుకి, మిగతా వాళ్లు కూర్చున్న చోటుకి మధ్య విశాలమైన ఖాళీ స్థలముంది. ఆ ఖాళీ స్థలంలో చాపలు పరచుకొని నాలుగవ తరానికి చెందిన దాసుగారి మునిమనవళ్లు, మునిమనవరాళ్లు సుమారు ఓ నూటయాభై మంది కూర్చొని ఉన్నారు. వారి వయసులు ఏడాది నుంచి ఇరవై ఏళ్ల వరకూ ఉన్నాయి.

అసలు దాసుగారి ఇంతటి విచారానికి కారణం, నిన్నటి రోజున అతనికొక వెడ్డింగ్ కార్డు, దానితోబాటు ఒక ఉత్తరం వచ్చింది. వెడ్డింగ్ కార్డు సరేసరి అతనికి ఆనందం కలిగించింది. కాని వెడ్డింగు కార్డుకు జతపరచ బడిన ఆ ఉత్తరమే అతనికి మింగుడు పడలేదు.

**పూజ్యులయిన నాగేంద్రదాసు గారికి,**

నమస్కారం.

ఇందువెంట జత చేయబడిన వెడ్డింగు కార్డులో నా మనవరాలి వివాహం తేదీ, మిగతా వివరాలు ఉన్నాయి. దయఉంచి ఈ వివాహానికి, మీరుగాని, మీ కుటుంబ సభ్యులెవరు గాని రాకూడదు. ఇది నా మనవి. నా ప్రార్థన. నా ప్రార్థనను మన్నించవలసినదిగా వేడుకుంటున్నాను.

ఇట్లు
నీ చిరకాల మిత్రుడు,
**ఆనందదాసు**

ఇదీ అసలు సంగతి. ఎవరైనా పెళ్లికి వస్తే సంతోషి స్తారు గాని, ఇలా పెళ్లికార్డు పంపి, తేదీ వివరాలు తెలియజేసి మరీ పెళ్లికి రావద్దని వేడుకునే వాళ్లుంటారా! ఇదే అందరి ఆలోచనలకూ కారణమయింది. ఎవరికీ పరిష్కారం దొరకడంలేదు. పర్యవసానం ఏమిటో అర్థం కావడంలేదు. దాసుగారు దీన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నారు.

దాసుగారు ఒక విచిత్రమయిన మనిషి. దాసుగారి తాత ముత్తాతలు ఎస్టేటుదారులు. గ్రామాలకు గ్రామాలు వారి ఆధీనంలో ఉండేవి. వాటి మీద వచ్చే ఆదాయంతో మహరాజుల్లా దర్జాగా బ్రతికేవాళ్లు. దాసుగారి హయాం వచ్చేసరికి ఎస్టేట్లు రద్దయ్యాయి. ఎస్టేట్లు రద్దయిన తరువాత వచ్చిన డబ్బుతో దాసుగారు హైదరాబాదుకు వచ్చేసి దిల్‌షుక్‌నగర్‌లో విశాలమైన ఒక పెద్ద బంగళా కొని అక్కడికి కాపురమొచ్చేసాడు. తాత ముత్తాతలు, తండ్రి ఆచారం ప్రకారం అప్పటికే దాసుగారికి ఆరుగురు భార్యలు.

కాలక్రమంలో అతనికి కలిగిన సంతానం, ఆ సంతానానికి కలిగిన సంతానం, మళ్లీ ఆ సంతానం యొక్క సంతానం. ఇలా నేటికి ఆ నాలుగంతస్తుల భవనంలోని అన్ని గదులూ దంపతులతో నిండి పోయింది. ఆ నాలుగంతస్తుల భవనం నలుచతురస్రాకారంలో విశాలమైన నాలుగెకరాల స్థలంలో ఉంది. చుట్టూ కోటగోడలాంటి ఎత్తయిన ప్రహరీ. తూర్పువైపు విశాలమైన పెద్ద గేటు. భవనంలోని అన్ని గదుల వాకిళ్లు లోపలి వైపుకి ఉంటాయి. లోపల భవనం మధ్య విశాలమైన ఖాళీ స్థలం. ఆ ఖాళీ స్థలం రకరకాల పండ్ల చెట్లతో నిండి ఉంటుంది. జామ, నారంజ, సపోటా, బత్తాయి, మామిడి, కొబ్బరి, ఇంకా ఒకటేమిటి పలురకాల చెట్లతో నిండి ఉంటుంది. ఎండాకాలంలో చెట్ల నీడన పిల్లలు ఆడుకుంటారు. పెద్దవాళ్లు సేద తీరుతుంటారు. పగలు, రాత్రి అవసరమైనప్పుడల్లా ఆ కుటుంబ సమావేశాలు దాసుగారి ఆధ్వర్యంలో జరుగుతుంటాయి అక్కడే.

దాసుగారు కోడళ్లను బయటనుంచి తెచ్చుకున్నట్లే, అల్లుళ్లని కూడా బయటినుంచి తెచ్చుకొని ఇల్లరికంగా తన ఇంట్లోనే ఉంచుకుంటాడు. పెళ్లయిన దంపతుల

కల్లా భవనంలోని ఒక గది కేటాయిస్తుంటాడు. ప్రస్తుతానికి భవనంలోని అన్ని గదులూ నిండాయి కనుక ఇక పెళ్లికాబోయే వాళ్లకు పై అంతస్తు వేసి గదులు కట్టాల్సిందే.

ఇంతమంది సభ్యులున్న ఇంత పెద్ద ఉమ్మడి కుటుంబాన్ని దాసుగారు ఏ అరమరికలు లేకుండా, ఎవరి మధ్యా ఏ అపార్థాలు రాకుండా, ఎవరికీ ఏ అసౌకర్యం కలుగకుండా, ఒంటిచేత్తో నడుపుకు రావడం అతని తెలివితేటలకు నిదర్శనం.

ఇతనికున్న ఆర్థిక వనరులన్నీ ఒక పద్ధతి ప్రకారం ఇతను ఏర్పాటు చేసినవే. ఇతనికి జంట నగరాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ రకరకాల వ్యాపారాలున్నాయి. అవి పెద్ద వ్యాపారాల దగ్గర నుంచీ, చిన్న టీకొట్టు వరకూ ఉన్నాయి. అన్ని వ్యాపారాలూ అతని కొడుకులు, మనవళ్లు, ముని మనవళ్లూ చూసుకుంటారు. వాళ్లే యజమానులు, వాళ్లలోని వాళ్లే వర్కర్లు, పరాయి వాడు ఉండడు.

ఆబిడ్స్‌లో ఆటో స్పేరుపార్టుల కొట్టుంది. నాంపల్లిలో పచ్చళ్ల కొట్టుంది. మెహిదీపట్నంలో మామిడి కాయల వ్యాపారం, బంజారాహిల్స్‌లో బంగాళా దుంపల వ్యాపారం. అమీర్‌పేటలో ఆవకాయమ్మే కొట్టు, బేగంపేటలో బిర్యానీ కొట్టు ఉంది. జూబ్లీ హిల్స్‌లో జిలేబీల అమ్మకం, రాణీగంజ్‌లో కిరాణా కొట్టు, తార్నాకలో తాటిముంజెల వ్యాపారం. ఆల్వాల్‌లో అరటికాయల వ్యాపారం, బొల్లారంలో బొగ్గుల దుకాణం, హిమాయత్‌నగర్‌లో బనీన్ల దుకాణం, బర్కత్ పురాలో పూరీల అమ్మకం, దిల్‌షుక్‌నగర్‌లో దిండ్ల వ్యాపారం, ఇమ్లీబన్ బస్టాండులో ఇడ్లీల కొట్టు, కాచిగూడలో కాగితాల వ్యాపారం, చార్మినార్ దగ్గర గాజుల అంగి. కోఠి దగ్గర కోడిగుడ్ల వ్యాపారం.

అంతేగాక గోల్కొండ, అంబర్‌పేట, అమీర్‌పేట, అఫ్జల్‌గంజ్, ఉస్మానియా యూనివర్సిటీ, బోరబండ, చంపాపేట, దోమలగూడ, ఫిల్మ్‌నగర్, గ్రీన్‌లాండ్స్, ఇందిరానగర్, కర్మన్‌ఘాట్, లంగర్‌హౌస్, లాలాపేట, మాదాపూర్, మూసాపేట, పురానాపూల్, పంజాగుట్ట, రామంతాపూర్, సరూర్‌నగర్, ఉప్పల్ ప్రాంతాల్లో స్కూటరు రిపేరు షాపులు, పూలకొట్లు, టీ బడ్డీలు అశేషంగా ఉన్నాయి.

భవంతి క్రింది అంతస్తులో ఒకటో తరగతి నుంచి టెన్త్ క్లాస్ వరకూ ఒక స్కూలు ఉంది. ఆ స్కూలుకు హెడ్‌మాస్టర్ దగ్గరనుంచీ, టీచర్ల వరకూ బిఇడి చదివిన దాసుగారి కుటుంబ సభ్యులే. గంటకొట్టే ప్యూను కూడా దాసుగారి కుటుంబ సభ్యుడే. ఆ ఇంట్లోని పిల్లలకు తప్ప వేరే వాళ్లకు ఆ స్కూల్లో ప్రవేశం లేదు.

ఆ స్కూలును ఆనుకొనే పదిబెడ్ల క్లినిక్ ఒకటుంది. ఆ హాస్పిటల్లో మెడిసిన్ చదివిన దాసుగారి ఇద్దరి కూతుళ్లు, ఇద్దరు అల్లుళ్లు పనిచేస్తుంటారు. దాసుగారి నలుగురు మనవళ్లూ కాంపౌండర్లుగా ఉంటే, వాళ్ల భార్యలు నర్సులుగా ఉంటున్నారు. దాసుగారి కుటుంబ సభ్యులు ఎవరికైనా జ్వరాలు, వ్యాధులు వస్తే ఇక్కడే ట్రీట్‌మెంట్ తీసుకుంటారు.

అంతేగాక దాసుగారి నలుగురు కుటుంబ సభ్యులు మగవాళ్లు రోజుకు ఇద్దరుచొప్పున టర్న్‌డ్యూటీల ప్రకారం ఆ భవంతిని కాపలా కాస్తూ గేటు దగ్గర పగలూ, రాత్రీ గూర్ఖా పనులు నిర్వహిస్తారు. వాళ్ల పని అదే.

అలాగే వంట కూడా. మొత్తం సుమారు 300 మంది కుటుంబ సభ్యులకూ భోజనం కంబైన్డ్‌గా తయారవుతుంది. క్రింది అంతస్తులోనే పెద్ద వంటగది. దానికి ఆనుకొనే ఒకేసారి వందమంది భోజనం చేయగల పర్మినెంటుగా సిమెంటుతో కట్టబడిన సిమెంటు బెంచీలతో కూడిన పెద్ద డైనింగు హాలుంది. అక్కడ కేర్‌టేకర్‌గా వారానికొకరు అజమాయిషీ చేస్తుంటారు. దాసుగారు శాశ్వతంగా నిర్ణయించిన మెనూ ప్రకారం ఉదయం టిఫిను, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అక్కడ తయారవుతుంది.

వారానికి ఒక బ్యాచ్ చొప్పున వారంలో పదిమంది స్త్రీలు లోపల వంట చేస్తే, పదిమంది స్త్రీలు కూరలు తరగడం, వడ్డించడం లాంటి బయటి పనులు చేస్తారు. మరో పదిమంది పాత్రలు కడగడం, తోమడం లాంటి పనులు చేస్తారు. వీళ్లు టర్న్ డ్యూటీ ప్రకారం వారం

## అయ్యో చోద్యమూ

గీకి పారేసిన అగ్గిపుల్లల్లా
దంతాలన్నీ వూడిపోయాయి
ఒంటికొమ్ము ఎద్దులాగ
ఒకే దంతం మిగిలి వున్నది
అద్దం ముందు చూసుకుంటే
బోడితల గాంధీజి మోము
జ్ఞాపకానికి వస్తున్నది.
అరిగేకొద్దీ సానబట్టిన
వజ్రంలా మనసు మాత్రం
వైరాగ్యం వైపు మొగ్గుచూపక
మరీ మరీ చైతన్యమవుతున్నది.

–సిరి

రోజులకు ఒకసారి అటూ ఇటూ డ్యూటీలు మారుతుంటారు.

ఇకపోతే కుటుంబంలోని మిగతా స్త్రీలలో ఓ పదిమంది చిన్నపిల్లలకు స్నానాలు చేయించడం, బట్టలు తొడిగి, జడలు వేసి బడికి పంపడం చేస్తుంటారు. వాళ్ల పిల్లలని, వీళ్ల పిల్లలని తేడా లేదు. అంతా సామూహికంగా జరిగిపోతుంది. రాత్రి పొడుకొనేప్పుడు మాత్రమే చిన్నపిల్లలు ఎవరి తల్లిదండ్రుల దగ్గరకు వాళ్లు వెళతారు.

ఇంకా పశువులకు మేత వేయడం, పాలు పితకడం, గదులు ఊడ్చడం, కిటికీలు తుడవడం వంటి పనులు మిగతా స్త్రీలు చేస్తారు. ఎవరికి కేటాయించిన పనులు వాళ్లు టర్న్ ప్రకారం చేసుకుంటూ పోతారు. ఎప్పటికప్పుడు నోటీసు బోర్డులో ఎవరు ఏ పనులు చేయాల్సిందీ దాసుగారి సంతకంతో కాగితం అంటించబడి ఉంటుంది.

దాసుగారు ఎప్పటికప్పుడు సర్‌ప్రయిజ్ విజిట్లు చేస్తుంటారు. ఎక్కడ ఏమాత్రం తేడా వచ్చినా ఊరుకోడు. అందరినీ క్రమశిక్షణలో పెట్టి ఎవరి డ్యూటీ వాళ్లు సక్రమంగా, భయంగా చేసుకొనేట్లు చేస్తాడు.

దాసుగారు ఇన్ని కార్యక్రమాల్ని ఇంత సమర్థవంతంగా చేసుకొంటూ పోవడానికి కీలకం అతని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు. ఇది ఆ ఇంటికి గుండెకాయలాంటిది. దాసుగారి గుండె లబ్‌డబ్‌ల శబ్దం ఇక్కడ వినిపిస్తూ ఉంటుంది. ఇది భవనం క్రింది అంతస్తులో కుడివైపున విశాలమైన గదిలో ఉంది. దాసుగారి కుటుంబ ఆదాయ, వ్యయ వివరాలు ఇక్కడ తయారవుతూ ఉంటాయి. బయట వ్యాపారాలు చేసే దాసుగారి కుటుంబ సభ్యులు ఏ రోజు ఆదాయాన్ని, ఆరోజు సాయంత్రం ఇక్కడ క్యాషియర్ దగ్గర జమచేసి రశీదు తీసుకోవాలి. ఇక్కడనుంచే ఏ నెల కానెల భోజనం ఖర్చులకు, హాస్పిటల్ ఖర్చులకు, స్కూలు మెయింటెనెన్సుకు, బట్టల ఖర్చులకూ, మరి ఇతరత్రా ఖర్చులకూ బడ్జెట్ అలాటవుతుంది.

ఈ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసులో పనిచేసే క్యాషియర్లు, క్లర్కులు, అకౌంటెంట్లు, అటెండర్లు, దాసుగారి కుటుంబ సభ్యులే. వాళ్లు ఏరోజు కారోజు ఆదాయం, వ్యయం లెక్కలు వ్రాసి ఆ లెడ్జర్ల మీద కుటుంబ అజమాయిషీదారు అయిన దాసుగారి ముందు పెట్టి ఆయన సంతకాలు తీసుకుంటారు. ఆయన అన్ని శాఖలూ తనిఖీ చేస్తూనే రోజుకో గంట ఈ అడ్మిస్ట్రేటివ్ ఆఫీసులోని మేనేజరు సీటులో కూర్చుని లెక్కలు తనిఖీ చేస్తుంటారు.

దాసుగారి కుటుంబంలోని 75 మంది మగవాళ్లు మాత్రమే సంపాదించేవాళ్లు. వీళ్లు రకరకాల వ్యాపారాలు చేసి తెచ్చే ఆదాయాన్ని ఇంట్లో ఉన్న సుమారు 225 మంది స్త్రీలు, పిల్లలూ, ఇతరత్రా పనులు చేసే ఉద్యోగులూ తినాలి. ఇది ఎంతమాత్రమూ సరిపోదు. అందులోనూ దాసుగారు భోజన ప్రియులు. ఒకప్పుడు రోజూ పంచభక్ష్య పరమాన్నాలు తిన్న వంశం.

అందుకే దాసుగారు చాలా ఏళ్లుగా అటు సాంప్రదాయం పోకుండా, ఇటు కుటుంబ సభ్యులకు షడ్రసోపేతమైన భోజనం దొరికేట్లుగా ఒక ఉపాయం ఆలోచించాడు. ఆ ఉపాయం ప్రకారం జంట నగరాల్లో ఎక్కడ పెళ్లి జరిగినా తన కుటుంబ సభ్యులతో వెళ్లి పెళ్లివాళ్లలో కలిసిపోయి పెళ్లి భోజనాలు చేయడం. ఆ పెళ్లి కూడా తన కుటుంబాన్ని భరించగల శక్తి గల పెళ్లినే ఎంచుకోవడం.

దాసుగారి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసులో ఓ మూల ఉన్న చిన్న లైబ్రరీకి అన్ని పేపర్లూ వస్తాయి. ఉదయాన్నే లైబ్రేరియన్ పేపర్లన్నీ తిరగేసి నగరంలో ఆరోజు జరుగుతున్న పెళ్లి ప్రకటనలు కట్‌చేసి దాసుగారికి పంపిస్తాడు. దాసుగారు నగరంలోని సదరు ఏరియాల్లో పనిచేసే తన కుటుంబ సభ్యులను పిలిచి వాళ్లకా వివరాలిస్తాడు. వాళ్ల ద్వారా ఎవరు బాగా ఖర్చుపెట్టగల శక్తి గల వారో తెలుసుకొని ఆ పెళ్లికి తన 300 మంది కుటుంబ సభ్యులతో వెళ్తాడు. ఆహ్వానం అవసరం లేదు. జంట నగరాల్లో తిరిగే తమ ఆరు ట్రాన్సుపోర్టు లారీల్లోనే వాళ్ల ప్రయాణం. సుష్టుగా భోంచేసి, వాచ్‌మన్‌లు పనిచేసే తమ కుటుంబ సభ్యులకు కూడా భోజనాలు పట్టుకొస్తారు.

మొదట్లో దాసుగారి ఈ అనాహ్వానిత రాకకు కొందరు ఆశ్చర్యపోయారు. మరికొందరు విసుక్కున్నారు. కాని, రాను రాను దాసుగారి రాకవల్ల వాళ్లకు జరిగే ఉచిత సేవ కూడా అర్థం చేసుకున్నారు. ఇలా పెళ్లిలో సుష్టుగా భోంచేసిన దాసుగారి కుటుంబ సభ్యులు నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఈ పెళ్లి గురించి ఘనంగా చెప్పేవారు. దీంతో ఆ పెళ్లి కుటుంబం యొక్క గౌరవ మర్యాదలు సువాసనలా ప్రజల్లో వ్యాపించేవి. దాంతో దాసుగారి కుటుంబం తమ పెళ్లికి రావడం ప్రిస్టేజిగా భావించడం మొదలుపెట్టారు జంటనగరాల ప్రజలు. ఇలా నెలకో కనీనం పదిహేను రోజులు బయట భోజనాలు జరిగిపోవడంతో దాసుగారి పరిస్థితి స్థిరంగానే

ఉంది.

అలాంటిది ఈనాడు ప్రక్కవీధి ఆనందదాసు తమను పెళ్లికి రావద్దని ప్రాధేయపడుతూ ఉత్తరం వ్రాసాడు. ఆ ఉత్తరం వ్రాయకున్నా తాము వెళ్లి ఉండేవారు. కాని ఇప్పుడు ఏం చేయడం. అందుకే కుటుంబ సభ్యులతో ఈ అత్యవసరం సమావేశం ఏర్పాటు చేశాడు.

రాత్రి పదింటికి పెళ్లి. మనసు మార్చుకొని భోజనం వేళకయినా పిలుస్తాడని నమ్మకంతో ఆ రాత్రి ఇంట్లో వంట ఏర్పాటు చేయలేదు. జరిగిందిది.

దాసుగారిలో ఆత్మ విమర్శన మొదలయింది. తను కుటుంబ నియంత్రణ పాటించకుండా కుటుంబ సభ్యుల్ని విపరీతంగా పెంచడమే కాకుండా తన సంతానాన్ని కూడా కుటుంబ నియంత్రణకు వ్యతిరేకుల్ని చేశాడు. అంతేగాక తను పూర్వాచారాలను, ఆర్భాటాలను పాటిస్తూ జీవించబట్టే తను ఇలా ఆర్థికంగా చితికిపోయాడు. ఇకనైనా జాగ్రత్తపడాలి.

ఆ విశాల ప్రాంగణంలో ఒంటి స్తంభం మీదున్న కామన్ గడియారం, 'టంగ్.. టంగ్..'మంటూ తొమ్మిది గంటలు కొట్టడంతో దాసుగారు ఉలిక్కి పడ్డారు.

"చిన్న పిల్లలు ఆకలికి నకనకలాడి పోతున్నారు. టైంలేదు. డ్యూటీలో ఉన్నవారు వెంటనే వెళ్లి పులిహోరా చేయండి. ఆనందదాసు నన్ను అవమానించినందుకు నేనెలాగూ పగతీర్చుకుంటాను" అని చెప్పి లేచి నిలుచున్నాడు.

వెంటనే సమావేశం పూర్తయినట్లు గణగణమని గంట మ్రోగింది. వెళ్లడానికి అందరూ లేచి నిలుచున్నారు. ఇంతలో వాళ్లకో వింత దృశ్యం కనిపించింది. ఖరీదైన దుస్తుల్లో ఉన్న వృద్ధుడయిన ఆనందదాసు, తన డ్రైవరు వెంటరాగా గూర్ఖా పెట్టిన నమస్కారం స్వీకరించి, హ్యాండ్ స్టిక్ ఊపుకొంటూ వడివడిగా నడుస్తూ సమావేశం దగ్గరకి వచ్చాడు.

"మిత్రమా! దాసూ" అంటూ దాసుగారిని కౌగలించుకొని కన్నీరు కార్చాడు.

దాసుగారి హృదయం కరిగిపోయింది. అంతవరకూ ఆనందదాసు మీద ఉన్న కోపం కరిగిపోయింది.

"ఏమయింది ఆనందూ? పెళ్లి పందిట్లోంచి నేరుగా వచ్చినట్లున్నావు"

"నేను చేసిన పాపానికి ఫలితం జరిగింది నాగేంద్ర దాసూ. ఆర్థికంగా ఖర్చు అవుతుందని మా అబ్బాయి పిసినారితనంతో ఇచ్చిన ఐడియాతో నీ కుటుంబాన్ని పెళ్లికి రావద్దన్నాను. ఇప్పుడేమయింది. మావాడు ఏదో అన్నాడని నా తమ్ముళ్ల కుటుంబాల వాళ్ళు, చెల్లెళ్ల కుటుంబాల వాళ్లూ పెళ్లిని బహిష్కరించారు. అంతేగాక మా బంధువుల్ని ఎవర్నీ పెళ్లికి రానివ్వలేదు. పెళ్లి పందిరి బోసిపోయి ఉంది. పెళ్లి కుమార్తెను అలంకరించే ఆడవాళ్లు లేరు. పెళ్లి కొడుకుని విడిది నుంచి తీసుకొచ్చే మనుషుల్లేరు. నన్ను దయతో క్షమించి మీరందరూ వెంటనే పెళ్లికి రావాలి. కాదంటే నామీద ఒట్టే" అన్నాడు ఆనందదాసు.

దాసుగారి హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. అతని కుటుంబ సభ్యుల పరిస్థితి కూడా అలాగే ఉంది.

"ఆనందూ. మేమిప్పుడే బయలుదేరి వస్తున్నాం. నువ్వేం బెంగపెట్టుకోకు. అన్ని పనులూ సవ్యంగా జరుగుతాయి" అంటూ ధైర్యం చెప్పిన దాసుగారు ప్రక్కనున్న కొడుక్కి ఏదో సైగచేశాడు.

వెంటనే గంట గణగణమని మ్రోగింది. పెళ్లికి వెళ్లడానికి తయారు కమ్మన్న సిగ్నల్ అది. అంతే. చిన్నా, పెద్దా బిలబిలమంటూ ఎవరి గదుల్లోకి వాళ్లు దూరారు. సూటుకేసులు తీసి తమ పెళ్లి దుస్తులు ధరించారు. గుండెల మీద 'దాస్ ఫామిలీ' అన్న ఎంబ్లెమ్ తగిలించుకున్నారు. చక్కగా ముస్తాబై సెంట్లు స్ప్రే చేసుకుని, అలవాటు ప్రకారం ఆరు ట్రాన్స్‌పోర్ట్ వాహనాల్లో ఎవరి సీట్లలో వాళ్లు సర్దుకు కూర్చున్నారు. అందరూ కూర్చున్నట్లు కన్ఫర్మ్ కాగానే మళ్లీ బెల్ మ్రోగింది. వాహనాలు కదిలాయి.

ఆ వాహనాల వెనుక నాగేంద్రదాసు, ఆనందదాసు కారులో బయలుదేరారు. పెళ్లి పందిట్లోకి రాగానే ముందు అందరికీ భోజనాలు ఏర్పాటు చేశాడు ఆనందదాసు. అందరూ తృప్తిగా భోంచేశారు. భోజనం కాగానే దాసుగారి కుటుంబ సభ్యులు యథాప్రకారం, కొత్తా పాతా లేకుండా స్వచ్ఛందంగా ఎవరికి వాళ్లే తలా ఒక పనిలో పడ్డారు. పెళ్లి కుమార్తె అలంకరణ ఒకపక్క జరుగుతోంది. పెళ్లికొడుకుని తీసుకురావడానికి మేళతాళాలతో కొందరు వెళ్లారు. పట్టుచీరల గరగరలు, కొత్తగాజుల గలగలలు, వదినా ఆడపడుచుల హాస్యాలు, బావా మరదళ్ల సరసాలు, చిన్నపిల్లల కేరింతలు, అప్పటివరకూ బోసిపోయి ఉన్న ఆ పెళ్లి పందిట్లో 'పెళ్లికళ వచ్చేసింది.'

ఖరీదైన దుస్తుల్లో హ్యాండ్ స్టిక్‌లు పట్టుకొని హుందాగా తిరుగుతున్న నాగేంద్రదాసు, ఆనందదాసు ఆ దృశ్యాల్ని తిలకిస్తూ ఆనందపడిపోతున్నారు. ■